క్లుప్తంగా

పాఠశాలకు బియ్యం విరాళం



హెచ్ఎంకు నగదు అందిస్తున్న దాత మాలకొండారెడ్డి

పీసీపల్లి: ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకానికి దాతలు మసూరా బియ్యం అందజేశారు. మండల పరిధిలోని దివాకరపలి పాఠశాలకు నేరేడుపల్లికి చెందిన చాగంరెడ్డి మాలకొండారెడ్డి పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకానికి గాను మసూరా బియ్యం అందించేందుకు రూ.10వేలు అందించారు. కార్యక్రమంలో అదనపు ఎంఈఓ శ్రీనివాసులు, ప్రధానోపాధ్యాయులు అరుణ, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పాఠశాలకు కుర్చీల వితరణ



దాత రమణయ్యను సన్మానిస్తున్న పాఠశాల యాజమాన్యం

వెలిగండ్ల: పాఠశాలల అభివృద్ధికి దాతలు చేయూతనందించటం అభినందనీయమని ప్రధానోపాధ్యాయుడు రాఘవాచారి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్కు వైఎస్సార్ సీపీ మండల బీసీసెల్ అధ్యక్షుడు యెలికె రమణయ్య వారి బాబాయి యెలికె వెంకటేశ్వర్లు జ్ఞాపకార్థం పాఠశాలకు 15 కుర్చీలు అందచేశారు. అనంతరం పాఠశాల యాజమాన్యం దాతను సన్మానించారు. పీఎంసీ చైర్మెన్ ఆకుల రవికుమార్, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పలకలు, పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు పలకలు, పుస్తకాలు అందజేస్తున్న హెచ్యం, దాత శ్రీను

పామూరు: విద్యార్థులు దాతలు సమకూర్చి అందజేసిన విద్యాభ్యాసన సామగ్రిని సద్వినియోగం చేసుకోవాలని పాఠశాల హెచ్యం జొన్నాబొట్ల గురునాథ ప్రసాద్ అన్నారు. మండలంలోని దూబగుంట్ల ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడు, దాత వెలుగు శ్రీనివాసులు రూ.43 వేల సొంత నిధులతో విద్యార్థులకు పలకలు, నోట్పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, కాపీరైటింగ్బుక్స్ విద్యాభ్యాసన సామగ్రిని హెచ్ఎం గురునాథ ప్రసాద్తో కలిసి విద్యార్థులకు అందజేశాడు. పీఎంసీ చైర్మన్ సైకం వెంకట రమణమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

98 మందికి వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ సందీప్

హనుమంతునిపాడు: ఇంటింటికీ ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవల్లో భాగంగా మంగళవారం వీరరాంపురంలో డాక్టర్ సందీప్ వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 98 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. వైద్య సిబ్బంది షేక్ మస్తాన్, డేవిడ్, ఎస్ఎం, ఎంఎల్హెచ్పీ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

పిచ్చికుక్క కరిచి 10 మందికి గాయాలు



గాయాలను చూపుతున్న మహిళ

పీసీపల్లి: మండల పరిధిలోని వితలాపురంలో మంగళవారం పిచ్చికుక్క కరిచి 10 మంది గాయాలయ్యాయి. గ్రామంలో స్వైరవిహారం చేస్తున్న పిచ్చికుక్క మంగళవారం అటుగా వెళ్తున్న ఉండేల మల్లికార్జున, లక్ష్మీ, రాజశేఖర్, కొండమ్మ, కుమారి, సుబ్బమ్మలతో పాటు మరికొంత మందిని కరిచింది. బాలాజీ అనే వ్యక్తికి తీవ్ర గాయాలు కావడంతో ఒంగోలుకు తరలించారు. మిగిలిన వారంతా పీసీపల్లి ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు.

నేడు కలికవాయలో గడప గడపకు మన ప్రభుత్వం

సింగరాయకొండ: మండలంలోని కలికవాయ గ్రామంలో బుధవారం ఉదయం 7 గంటలకు వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్చార్జి వరికూటి అశోక్బాబు ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మండల నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో చివరి రోజు, చివరి గ్రామంలో నిర్వహిస్తున్న కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, మండల, గ్రామ స్థాయి అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

రాజకీయాలకతీతంగా సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే, టీటీడీ పాలక మండలి సభ్యుడు బుర్రా మధుసూదన్ యాదవ్



పథకాల లబ్ధి బుక్లెట్ను అందచేస్తున్న ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్

కనిగిరి రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలనలో కుల, మత వర్గ విభేదం లేకుండా, పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలను అందచేస్తున్నట్లు ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యుడు బుర్రా మధుసూదన్ యాదవ్ అన్నారు. సీఎస్పురం సచివాలయం- 1 పరిధిలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ మాట్లాడుతూ కరోనా కష్ట కాలంలో సైతం ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేసి రాష్ట్ర ప్రజలను ఆదుకున్న ఘనత సీఎం వైఎస్ జగన్ మోహన్రెడ్డిదేనన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్రెడ్డి జనరంజక పాలన సాగిస్తున్నారన్నారు. టీడీపీ హయాంలో దోచుకో.. దాచుకో.. పంచుకో తప్ప అభివృద్ధి శూన్యమన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అర్హత కల్గిన ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందచేస్తున్నట్లు చెప్పారు. తొలుత వీరాంజనేయులు, ఎంపీటీసీ బత్తుల మాలకొండయ్య, జెడ్పీటీసీ మేకల శ్రీను, సంగిశెట్టి వాసు, కోటా రమేష్, బత్తుల కొండయ్య, సింగిల్ విండో అధ్యక్షుడు పెరుగు సుబ్బరామయ్య, మహిళా అధ్యక్షురాలు జయమ్మ, ఖాజా, బత్తుల శ్రీను, పాలకొల్లు వెంకటేశ్వరరెడ్డి, దేవరాజ్, మితికల గురవయ్య, బీటిఆర్, జయరెడ్డి, బి తిరుపతిరెడ్డిలు ఎమ్మెల్యే బుర్రాకు స్వాగతం పలికి సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దుగ్గిరెడ్డి ప్రతాప్రెడ్డి, భవనగిరి వెంకటయ్య, సర్పంచ్ రాధా కృష్ణారెడ్డి, శివాజీ బైరెడ్డి తిరుపతిరెడ్డి, మల్లి కార్జునరెడ్డి, ఉడుముల నారాయణరెడ్డి, మోహన్రెడ్డి, అద్దంకి రమణయ్య, జాజుల తిరుపాలు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో విభేదాలు లేవు

- పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అమృతపాణి స్పష్టీకరణ



మాట్లాడుతున్న వరికూటి అమృతపాణి

సింగరాయకొండ: కొండపి నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ నేతల మధ్య ఎటువంటి విభేదాలు లేవని, అవన్నీ ప్రతిపక్షాలు చేస్తున్న అసత్య ప్రచారాలేనని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వరికూటి అమృతపాణి స్పష్టం చేశారు. మండలంలోని కలికవాయలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పార్టీ ఇన్చార్జి వరికూటి అశోక్బాబు నిత్యం ప్రజల్లో ఉంటూ, సమస్యలు పరిష్కరిస్తూ ప్రజాభిమానం పొందారన్నారు. ఏపార్టీలో అయినా నాయకుల మధ్య చిన్నపాటి విభేదాలు సర్వసాధారణమని, అవన్ని టీ కప్పులో తుఫాన్ లాంటివని చెప్పారు. రానున్న ఎన్నికల్లో కొండపిలో వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా కృషి చేస్తున్నామన్నారు. కానీ కొంతమంది పనిగట్టుకుని కొండపిలో ఏదో జరిగిపోతోందని ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. అసత్యాలను నమ్మవద్దని ప్రజలను కోరారు. పొన్నలూరు జెడ్పీటీసీ బెజవాడ వెంకటేశ్వర్లు, వైస్ ఎంపీపీ సామంతుల రవికుమార్రెడ్డి, యన్నాబత్తిన చిన్నా పాల్గొన్నారు.

జగనన్న సురక్ష సద్వినియోగం చేసుకోవాలి



కంకణంపాడులో మాట్లాడుతున్న జెఏసీ కన్వీనర్ సుబ్రహ్మణ్యం

పీసీపల్లి: వచ్చే నెల 1 నుంచి ప్రారంభం కానున్న జగనన్న సురక్ష పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ అత్యాల జవన్య అన్నారు. సురక్ష కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యలను, అర్హులై ఉండి ప్రభుత్వ పథకాలు రాని వారు తమ సమస్యలు ప్రజాప్రతినిధులకు విన్నవించుకోవచ్చన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో వలంటీర్లు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొంటారన్నారు.

వెలిగండ్ల: ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా ప్రారంభిస్తున్నారని జేఏసీ కన్వీనర్ పొల్లా సుబ్రహ్మణ్యం అన్నారు. కంకణంపాడు సచివాలయంలో మంగళవారం జరిగిన జగనన్న సురక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల నాయకులు వై. నాగూర్యాదవ్, గ్రామ సర్పంచ్ మారం వెంకటేశ్వరెడ్డి, బొబ్బ వెంకటరెడ్డి, కె.వెంకటరామిరెడ్డి, దొడ్డా వెంకటేశ్వర్లు, పాటేండ్ల మాల్యాద్రి, దాదా సోమయ్య, ఎంఎల్ఓ మోహన్, కన్వీనర్లు, గృహ సారథులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గడప గడపకూ తిరిగే దమ్ముందా?

- మరుగుదొడ్ల బిల్లులు రూ.22 కోట్లు నొక్కేసి నీతులు చెబుతున్నావా
- లోకేశ్ కొండపి వస్తే చెంబులతో స్వాగతం పలుకుతా
- ఏసీ గదుల్లో పడుకోవడం పల్లె నిద్ర ఎలా అవుతుంది
- టీడీపీ ఎమ్మెల్యే స్వామిపై నిప్పులు చెరిగిన వరికూటి అశోక్బాబు



వరికూటి దంపతులకు ఘన స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు



సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న వరికూటి అశోక్బాబు, అమృతపాణి

సింగరాయకొండ: 'టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ప్రజా సమస్యలు గాలికొదిలేసి, మరుగుదొడ్ల నిధులు రూ.22 కోట్లు కాజేసిన నీకు జగనన్న ప్రభుత్వాన్ని విమర్శించే అర్హత ఉందా' అని ఎమ్మెల్యే డీబీవీ స్వామిపై వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్చార్జి వరికూటి అశోక్బాబు ధ్వజమెత్తారు. నిన్ను ఎమ్మెల్యేగా గెలిపించిన నియోజకవర్గ ప్రజలకు ఏం చేశావో చెప్పగలవా? గడప గడపకూ నాతోపాటు తిరిగే దమ్ముందా? అని స్వామికి సవాల్ విసిరారు. మంగళవారం సింగరాయకొండ మండలం కలికవాయ గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న అశోక్బాబుకు స్థానిక వైఎస్సార్ సీపీ నేత జి.శ్రీహరిరెడ్డి ఆధ్వర్యంలో ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గడప గడపకూ వెళ్లిన ఆయన గత నాలుగేళ్లలో ప్రభుత్వ పథకాలతో కలిగిన లబ్ధిని ప్రజలకు వివరించి బుక్లెట్ అందజేశారు. ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి వరికూటి మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే ధ్యేయంగా జగనన్న ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. వైఎస్ జగన్ మోహన్రెడ్డి గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో 99 శాతం నెరవేర్చారని పేర్కొన్నారు. పేదలకు ఇంతలా మేలు చేస్తుంటే ప్రతిపక్ష టీడీపీ ఎమ్మెల్యే, ఆ పార్టీ నాయకులు ఓర్వలేకపోతున్నారని విమర్శించారు. ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలు గుప్పిస్తూ బురద చల్లడమే పనిగా పెట్టుకున్నారని మండిపడ్డారు. నియోజకవర్గంలో 1.02 లక్షల గృహాలు ఉండగా ఇప్పటి వరకు సుమారు 97 వేల గడపలు తిరిగానని, 45 డిగ్రీల ఎండను సైతం లెక్కచేయలేదని చెప్పారు. ప్రజలతో మమేకమై వారి సమస్యలు పరిష్కరిస్తుంటే తనను జనం నిలదీస్తున్నారంటూ ఏసీ గదుల్లో పడుకునే ఎమ్మెల్యే స్వామి అసత్య ప్రచారం చేయడం సిగ్గుచేటన్నారు. ఇటీవల నందనవనం గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే స్వామి ఆరోపణలను అశోక్బాబు తిప్పికొట్టారు. టీడీపీ హయాంలో కొండపి నియోజకవర్గానికి కేంద్ర ప్రభుత్వం 25 వేల మరుగుదొడ్లు మంజూరు చేస్తే.. 15 వేల మరుగుదొడ్లు నిర్మించకుండానే రూ.22 కోట్ల బిల్లులు కాజేసి ×చెంబు స్వామి×గా గుర్తింపు పొందాడని ఎమ్మెల్యే స్వామిని ఎద్దేవా చేశారు. నారా లోకేష్ కొండపి వస్తే చెంబులతో స్వాగతం పలికి ఎమ్మెల్యే స్వామి అవినీతిపై నిలదీస్తా అని స్పష్టం చేశారు. వయసు కాని వయసులో దొంగచాటుగా పెళ్లి చేసుకున్న నీవు ఊడిపోయిన తాటిమట్ట అని నన్ను విమర్శిస్తావా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. పల్లెనిద్ర పేరుతో నందనవనం వెళ్లి ఏసీ గదిలో పడుకోవడం చూసి జనం నవ్వుకుంటున్నారన్నారు. ఎప్పుడొచ్చామన్నది కాదు.. బుల్లెట్ దిగిందా లేదా అనేదే ముఖ్యమని వరికూటి అనగానే సభా ప్రాంగణం జిందాబాద్లతో మారుమోగింది. వైఎస్సార్ సీపీలో విభేదాలంటూ టీడీపీ నాయకులు, ఎల్లో మీడియా చేస్తున్న ప్రచారం ఒట్టిమాటేనన్నారు. రానున్న ఎన్నికల్లో కొండపిలో వైఎస్సార్ సీపీ విజయ ఢంకా మోగించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. తొలుత గ్రామంలోని అంజనేయస్వామి విగ్రహానికి వరికూటి అశోక్బాబు, ఆయన సతీమణి లక్ష్మి పూజలు చేశారు. అక్కడి నుంచి కిలోమీటరు దూరంలోని వైఎస్సార్ విగ్రహం వరకు పాదయాత్రగా వెళ్లి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వరికూటి అమృతపాణి, వైస్ ఎంపీపీ సామంతుల రవికుమార్రెడ్డి, జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు చింతపల్లి హరిబాబు, సర్పంచ్ చిడిపూడి వెంకటరత్నం, ఎంపీటీసీ ఉలిచి అరుణ, గొరవరపు నాగేశ్వరరెడ్డి, పేరెంట్స్ కమిటీ అధ్యక్షుడు చామల వేణుగోపాలరెడ్డి, చిడిపూడి కృష్ణారెడ్డి, తన్నీరు కృష్ణ, బెల్లంకొండ నరశింహారావు, యన్నాబత్తిన చిన్నా, షేక్ సలీం బాషా, పొన్నలూరు జెడ్పీటీసీ బెజవాడ వెంకటేశ్వర్లు, పల్నాటి వెంకటేశ్వరరెడ్డి, పఠాన్ దియాజ్, దద్దాల మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నూతన పెన్షన్ విధానంతో కార్మికులకు మేలు

- భవిష్య నిధి సంస్థ జిల్లా అధికారి ఎం.సమ్మయ్య



మాట్లాడుతున్న నోడల్ అధికారి సమ్మయ్య

సింగరాయకొండ: కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన పెన్షన్ విధానంతో కార్మికులు సత్వరమే పెన్షన్ పొందవచ్చని ఉద్యోగ భవిష్య నిధి సంస్థ, నిధి ఆప్కే నిఖత్ ప్రోగ్రాం నోడల్ అధికారి ఎం.సమ్మయ్య పేర్కొన్నారు. స్థానిక పెరల్ డిస్టిలరీ కంపెనీలో మంగళవారం నూతన పెన్షన్ విధానంపై మండల పరిధిలోని కంపెనీల ప్రతినిధులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నోడల్ అధికారి మాట్లాడుతూ.. నూతన విధానం ప్రకారం ఉద్యోగులు హయ్యర్ పెన్షన్ ఆప్షన్ ఇవ్వడానికి 15 రోజుల వ్యవధి కల్పించారన్నారు. అర్హులైన పెన్షన్దారులు, కార్మికులు తమ దరఖాస్తులను జూలై 11వ తేదీలోగా ఆన్లైన్లో నమోదు చేయాలని సూచించారు. యాజమాన్యాలకు 3 నెలల కాలపరిమితి ఇచ్చారని తెలిపారు. పదవీ విరమణ చేసే కార్మికులకు ప్రయాస్ పథకం ద్వారా పెన్షన్ పేమెంట్ ఆర్డర్ ఆ నెల చివరి రోజున ఇస్తున్నామన్నారు. కార్మికులు తమ యూఏఎన్ నంబర్కు ఆధార్ను అనుసంధానం చేసుకోవాలని చెప్పారు. ప్రతి కార్మికుడు ఇ-నామినేషన్ ఆన్లైన్ ద్వారా సమర్పించాలని సూచించారు. నూతన విధానంలో పీఎఫ్ విత్డ్రా మూడు రోజుల్లో, డెత్క్లెయిమ్లు 7 రోజుల్లో పరిష్కారమవుతున్నాయని, గతంలో నెలరోజులు పట్టేదని వివరించారు. పెరల్ డిస్టిలరీ డీజీఎం శ్రీనివాసరావు, యూనిట్ హెడ్ కె.శ్రీధర్, అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ కె.శ్రీనివాసరావు, ఎం.శివకుమార్రెడ్డి, జీవీఆర్ ఆక్వా, దేవీ సీఫుడ్స్, మున్నంగి సీ ఫుడ్స్, బీకే త్రషర్స్ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

చింతలపాలెం వాసుల నిరసన

కనిగిరి రూరల్: చింతలపాలెం గ్రామానికి ప్రత్యేక ఫీడర్ ఏర్పాటు చేసి కరెంట్ సమస్య లేకుండా చేయాలని స్థానికులు మంగళవారం రాత్రి నిరసన తెలిపారు. గత నాలుగు రోజుల నుంచి పట్టణంలోని 3వ వార్డు పరిధిలోని చింతలపాలెంతోపాటు, ఎస్సీ కాలనీల్లో తరచూ విద్యుత్ అంతరాయం ఏర్పాటుతుందన్నారు. పట్టణంలో ఎక్కడ విద్యుత్ సమస్య వచ్చినా తమకు కరెంట్ తీసివేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సమస్య తీవ్రతను ఏఈ పవన్కుమార్కు విన్నవించారు. సమస్యను త్వరలో పరిష్కరిస్తామని ఏఈ చెప్పారు.

ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ



రామలింగాపురంలో మాట్లాడుతున్న ఎంఈఓ దాసుప్రసాద్




పామూరులో సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓలు

పామూరు: ప్రభుత్వం విద్యారంగంలో చేపట్టిన సంస్కరణలతోనే ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు విద్యార్థులతో కళకళలాడుతున్నాయని ఎంఈఓలు రవీంద్రనాథ్, కరుణకుమారి అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో మంగళవారం పాఠశాల హెచ్ఎం సంజీవి అధ్యక్షతన పీఎంసీ సమావేశం జరిగింది. కార్యక్రమానికి అతిథులుగా పాల్గొన్న ఎంఈఓలు మాట్లాడుతూ సీఎం వైఎస్.జగన్మోహన్రెడ్డి విద్య, వైద్య రంగాలకు అధికప్రాధాన్యం ఇచ్చారన్నారు. విద్యారంగానికి ఎన్నడూ లేని విధంగా బడ్జెట్లో 10 శాతానికి పైగా నిధులు కేటాయించారన్నారు. అమ్మఒడి, జగనన్న గోరుముద్ద, విద్యాకానుక, జగనన్న ఆణిముత్యాలు మొదలైన వాటితో పేదవిద్యార్థులకు అండగా నిలిచి, వారిని ప్రోత్సహించి పాఠశాలస్థాయి విద్యను బలోపేతంచేసిన ఘనత సీఎంకే దక్కిందన్నారు. అనంతరం గోరుముద్దను పరిశీలించి తగు సూచనలు చేశారు. జీజేసీ ప్రిన్సిపాల్ గుత్తి రమణయ్య, పీఎంసీ చైర్మన్ ఓగూరి తులసీఏడుకొండలు, బీసీ హాస్టల్ వార్డెన్ వెంకటేశ్వర్లు, నాగిక్రిష్ణవేణి, మితికాల నారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వెలిగండ్ల: సీఎం వైఎస్ జగన్మోహన్రెడ్డి విద్యా వ్యవస్థలో విప్లవాత్మకమైన నిర్ణయాలు తీసుకొని విద్యారంగాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని ఎంఈఓ దాసుప్రసాద్ అన్నారు. మండలంలోని రామలింగాపురం, రామగోపాలపురం, ఇమ్మడిచెరువు పాఠశాలలతో పాటు అన్ని ప్రాథమిక పాఠశాలల్లో మంగళవారం పేరెంట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ దాసుప్రసాద్ మాట్లాడుతూ ఈ ఏడాది పాఠశాలల పునః ప్రారంభం నాటికి ముందే పాఠ్యపుస్తకాల పంపిణీ పూర్తి చేశామన్నారు. పదో తరగతి ఫలితాల్లో కూడా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి ప్రభుత్వం నుంచి నగదు ప్రోత్సాహకాలు అందుకున్నారన్నారు. హెచ్ఎం గజ్జల తిరుపతిరెడ్డి, ఉపాధ్యాయుడు పి విజయానందం, పీఎంసీ చైర్మెన్ తిరుపాలు పాల్గొన్నారు.

సాగులో మెళకువలు పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

పీసీపల్లి: రైతులు సాగులో మెళకువలు పాటించాలని వ్యవసాయాధికారి జి.వెంకటస్వామి అన్నారు. మండలంలోని పెదయిర్లపాడు రైతు భరోసా కేంద్రంలో జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో రైతులకు ఖరీఫ్-2023కు సంబంధించి కంది, మినుము, శనగ, బొబ్బర్లు, మిర్చి పంటలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. పంటలో పాటించాల్సిన మెళకువలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. ఆత్మ ఆధ్వర్యంలో ప్రాజెక్టు డైరెక్టర్ కె.అన్నపూర్ణమ్మ మాట్లాడుతూ రైతు ఉత్పత్తి సంఘాల ఆవశ్యకతను వివరించారు. రైతులు సంఘాలుగా ఏర్పడి ఎరువులు, పురుగుమందులు, పంట సాగు పద్ధతి సంఘాల వారీగా మెరుగైన పద్ధతులు సాధించి తక్కువ సమయంలో ఎక్కువ దిగుబడులు సాధించవచ్చన్నారు. ఏడీఏ రమణ, డీఆర్సీఏఓ శేషమ్మ, శైలజ, వీఏఏలు శ్రీనివాసులరెడ్డి, రామిరెడ్డి, ఒంకారయ్య, రసూల్ పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

కందుకూరు రూరల్: మండల సర్వసభ్య సమావేశం బుధవారం ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పి.విజయశేఖర్ తెలిపారు. ఎంపీపీ ఇంటూరి సుశీల అధ్యక్షతన జరిగే సమావేశానికి మండల అధికారులు, జెడ్పీటీసీ, సర్పంచ్లు, ఎంపీటీసీలు హాజరుకావాలన్నారు. ఆయా శాఖల అధికారులు పూర్తి సమాచారంతో సమావేశానికి రావాలని కోరారు.

మల్లేశ్వర స్వామి ఆలయంలో పూజలు

పీసీపల్లి: మండల పరిధిలోని పెదయిర్లపాడులో నూతనంగా నిర్మించిన మల్లేశ్వర స్వామి దేవస్థానంలో వెలసిన సహస్ర ఈశ్వరుడికి మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ వ్యవస్థాపకుడు పలుకూరి సుబ్బారావు స్వామికి 16రోజుల పండుగ, గణపూతి పూజ, పుణఃవచనం, పంచామృతాభిషేకం, బిల్వార్చన, సహస్రనామ పూజ, అష్టోత్తర పూజ తదితర పూజలు నిర్వహించారు.

విద్యార్థులకు జేవీకే కిట్లు పంపిణీ

జరుగుమల్లి(కొండపి): జరుగుమల్లి మండలం కామేపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్లో మంగళవారం పేరెంట్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషిపై సీఎం సందేశాన్ని హెచ్ఎం అనూరాధ చదివి వినిపించారు. జగనన్న గోరుముద్ద పథకం ద్వారా నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందిస్తున్నట్లు తల్లిదండ్రులకు వివరించారు. అనంతరం జగనన్న విద్యా కానుక కిట్లను విద్యార్థులకు పంపిణీ చేశారు.

30లోగా ఈకేవైసీ చేయించుకోవాలి

టంగుటూరు: పీఎం కిసాన్ లబ్ధిదారులు ఈ నెల 30వ తేదీలోగా తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని ఏఓ స్వర్ణలత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బయోమెట్రిక్ అథెంటికేషన్తోపాటు ఫేస్ అథెంటికేషన్ మొబైల్ యాప్లను కేంద్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చినట్లు పేర్కొన్నారు. వేలిముద్రలు పడనివారు, ఆధార్కు ఫోన్ నంబర్ లింక్ కానివారు ఫేస్ అథెంటికేషన్ యాప్తో ఈకేవైసీ నమోదు చేయవచ్చని వివరించారు.

తాళ్లూరు పాఠశాలలో చోరీ

- రూ 1.30 లక్షల విలువైన సామగ్రి అపహరణ

కనిగిరి రూరల్: మండలంలోని తాళ్లూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం చోరీ జరిగింది. పాఠశాలలో నాడు-నేడు పనులకు ఉపయోగిస్తున్న ఇనుప చువ్వలతో పాటు, పాఠశాల గది తాళం పగుల కొట్టి అందులోని టీవీ, వాటర్ ఫిల్టర్ను అపహరించుకెళ్లారు. వాటి విలువ సుమారు రూ.1.30 లక్షలు ఉంటుంది. పాఠశాల హెచ్ఎం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దాసరి ప్రసాద్ తెలిపారు.

బాబా ఆలయంలో ప్రత్యేక పూజలు

కనిగిరి రూరల్: స్థానిక షిరిడీ సాయిబాబా దేవస్థానంలో సాయి అఖండ నామ సప్తాహంలో భాగంగా మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయి మహిళా బృందం ఆధ్వర్యంలో పట్టణంలో సాయి భిక్షా కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో దేవస్థాన కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు దేవకి సుబ్రహ్మణ్యం, పెన్నా వెంకటేశ్వర్లు, ముచ్చర్ల ధర్మ, వాగిచర్ల వెంకటేశ్వర్లు, ఈర్ల గురవయ్య, మండ్లా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పొగాకు అత్యధిక ధర రూ.246



వేలంలో పాల్గొన్న వ్యాపారులు

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రానికి కె.ఉప్పలపాడు గ్రామానికి చెందిన రైతులు 961 బేళ్లు తీసుకురాగా 932 కొనుగోలయ్యాయి. 29 పొగాకు బేళ్లను వ్యాపారులు తిరస్కరించారు. గరిష్ట ధర కేజీ రూ.246 కాగా, కనిష్ట ధర రూ.160, సరాసరి ధర రూ.242.74 పలికింది. వేలంలో మొత్తం 34 మంది వ్యాపారులు పాల్గొన్నారని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

కొండపిలో కేజీ రూ.245

కొండపి: స్థానిక పొగాకు వేలం కేంద్రానికి కామేపల్లి, పచ్చవ గ్రామాల రైతులు మంగళవారం 791 పొగాకు బేళ్లు తీసుకురాగా 730 కొనుగోలయ్యాయి. వ్యాపారులు వివిధ కారణాలతో 47 బేళ్లను తిరస్కరించారు. అత్యధిక ధర కేజీ రూ.245, అత్యల్ప ధర రూ.157, సరాసరి ధర రూ.234.26 పలికిందని వేలం నిర్వహణాధికారి ఎస్.రామారావు తెలిపారు.

ఉపాధి హామీ పనులను తనిఖీ చేసిన కేంద్ర బృందం

సింగరాయకొండ: మండలంలోని శానంపూడి, ఊళ్లపాలెం గ్రామాల్లో గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన అభివృద్ధి పనులను, పండ్ల మొక్కల పెంపకాన్ని కేంద్ర బృందం తనిఖీ చేసింది. అమృత సరోవర్ పథకంలో భాగంగా బంగారుకుంటలో పూడికతీత, అలాగే మామిడి, జామ మొక్కల పెంపకంతో రైతులకు కలిగిన మేలును కేంద్ర బృందానికి స్థానిక అధికారులు వివరించారు. జల్శక్తి అభియాన్ నోడల్ అధికారి, ట్రైబల్ అఫైర్స్ శాఖ డైరెక్టర్ మనోజ్ బాప్న, టెక్నికల్ అధికారి పి.యాదయ్య, డ్వామా పీడీ కె.శీనారెడ్డి, ఒంగోలు ఏపీడీ వెంకటస్వామి, ఎంపీడీఓ షేక్ జమీఉల్లా, ఏపీఓ సీహెచ్వీ సుధాకరరావు, సర్పంచ్ బల్లెకూర బ్రహ్మయ్య, పాకనాటి సుబ్బారెడ్డి పాల్గొన్నారు.



పండ్ల మొక్కలను పరిశీలిస్తున్న కేంద్ర బృందం